18

# కొత్తచిగుళ్ళు

సుమారు పదేళ్ళ తరువాత నేను వ్యాపారరీత్యా ఆ ఊరు వెళ్ళ వలసి వచ్చింది. ఆ ఊళ్ళో నా చిన్ననాటి స్నేహితుడు విశ్వనాథం, అతని భార్య చంద్రమతి వున్నారు. అందుకే వాళ్ళింట్లో దిగాలను కున్నాను.

పెళ్ళయిన తరువాత నేను చంద్రమతిని చూడబోవటం యిదే మొదటిసారి. నాకు విశ్వనాథాన్ని చూడాలనే ఆతురతకంటే చంద్ర మతిని చూడాలని చాల ఆతురతగా వుంది. చంద్రమతి తల్లీ తండ్రీ అంతా మా ఇంటి పొరుగునే వుండేవారు. చంద్రమతి ఇంటరు తరువాత చదువు మానేసింది. తరచు మా ఇంటికొచ్చి మా పిల్లలతో ఆడుకు నేది. నాదగ్గరకొన్ని తెలుగు నవలలు అడిగి పట్టుకెళ్ళేది. అప్పుడ ప్పుడు ఆ నవలల్లోని పాత్రల గురించి చెబుతూ వుండేది. ఓ రెండేళ్ళ పాటు ఆ నవలలు చదివేక అవి చంద్రమతిని ఎలా ప్రభావితం చేసిందీ నేను అర్థం చేసుకున్నాను. చాల ఆశ్చర్య పోయాను.

"ఏమండీ, ఫలానా రచయిత్రి వ్రాసిన ఫలానా నవల చదివారా? అబ్బ! ఎంత బావుందనుకున్నారూ"? అనేది చంద్రమతి,

"అందులో వున్న విశేషమేమిటో చెప్పు?" అనేవాడిని.

ఆ నవలల్లో చంద్రమతిని ఆకర్షించినదల్లా స్త్రీ పాత్రలు. ఆమెకు ప్రతి స్త్రీ పాత్రలోనూ ఒక ప్రత్యేకత కనిపించేది. ఒక స్త్రీ ఎమ్.ఏ. ప్యాసయి, ఐ. ఎ. ఎస్ చదివి పెద్ద ఉద్యోగస్తు రాలవుతుంది. మంచి హోదా పలుకుబడి సంపాదిస్తుంది. ఇంకొక స్త్రీ గొప్ప నర్తకై విదేశాలు పర్యటిస్తుంది. ఇంకొకావిడ సినిమా నటిగా మారి పేరు ప్రఖ్యాతు లార్జిస్తుంది. ఇంకొక స్త్రీ తన అందచందాలు మూలంగా ఒక గొప్ప

ధనికుడ్ని పెళ్ళాడి భోగ భాగ్యాలనుభవిస్తుంది. ఇంకొకావిడ గొప్ప రచయిత్రి, మరొకావిడ పెద్ద డాక్టరు. ఇలానే స్త్రీలంతా చాల గొప్ప వాళ్ళుగానూ వాళ్ళని పెళ్ళాడిన పురుషులంతా చవట మనుషుల్లాగానూ కనిపించేవారు చంద్రమతికి. వాళ్ళంతా విద్యావంతులూ, పెద్ద ఉద్యోగాలూ, వ్యాపారాలూ చేస్తున్నప్పటికీ తమ భార్యల గొప్పతనానికి లొంగిపోయి తమ వ్యక్తిత్వాలను పోగొట్టుకున్న వారిలా కనిపించారు. స్త్రీలో ప్రత్యేకతనేది వుంటే పురుషుడు బానిసలావడి వుంటాడనే ఒక వక్రమైన అభిప్రాయం ఏర్పడింది చంద్రమతికి. స్త్రీగాని ప్రత్యేకతను సాధిస్తే తన జీవితాన్ని తన ఇష్టమొచ్చినట్లు తిప్ప వచ్చుననే నమ్మకం ఏర్పడింది.

ఏదో ఒక నవల చదివి వచ్చాక "నాకు ప్రయివేటుగా ఎమ్.ఎ. వరకూ చదివి ప్యాసవాలని వుంది. పెద్ద ఉద్యోగం చెయ్యాలనుంది, అనేది నాతో.

"పట్టుదలుంటే చదవచ్చు. మంచిదే" అనేవాడిని.

మరోనాడు యింకేదో నవల చదివి వచ్చేది.

"మామయ్యగారు నాకు సంగీతం నృత్యం నేర్చుకోవాలనుందండీ. నా గాత్రం బావుంటుందని చాలమందన్నారు" అన్నది.

అక్కడ పాటలు పాటడం ప్రారంభిస్తుందేమో ననే భయం కొద్దీ "నీ గాత్రానికేం మహారాజులా వుంటుంది" అన్నాను. తన గాత్రాన్ని మహారాజుతో పోల్చినందుకు చంద్రమతి సంతోషించే వుంటుంది.

చంద్రమతి ఊహలు గాలిపటాల్లా ఆకాశంలో ఎత్తుగా విహరిస్తూ వుండేవి కాని గాలిపటాలను అదుపులో పెట్టడానికి దారాలున్నట్టుగానే ఆమె ఊహలకి కూడా దారాలుండేవి.

వాళ్ళది చాల పేద కుటుంబం. చంద్రమతి తండ్రి పిల్లలకి పెద్ద చదువులు చెప్పించలేడు. సంగీతాలు, నృత్యాలు నేర్పించలేడు. పెద్ద కట్నాలుపోసి ఆడపిల్లలకి పెద్ద సంబంధాలు చెయ్యలేడు. ఇవన్నీ చంద్రమతి ఊహలకి దారా ల్లావని చేసేవి.

అందుకనే చంద్రమతి అప్పుడప్పుడు నిస్పృహగా మాట్లాడేది. తను పెద్ద చదువు చదవడమెలాగా? చదివినా ఎలాంటి సిఫారసు లేని తనకు పెద్ద ఉద్యోగమెవడిస్తాడు? తను డాక్టరు కాలేదు, నటి కాలేదు, నర్తకి కాలేదు. ఏమీ కాలేనని దిగులు పడేది. చంద్రమతి మీద జాలి కలిగేది.

కాని ఆ దిగులు ఎక్కువసేపుండేది కాదు. మరొక నవల ఆ దిగులుకు విరుగుడులా పని చేసేది. మళ్ళీ ఆమెలోని ఊహలు దారాలు తెంపుకుని ఆకాశంలో పరుగెత్తడానికి ప్రయత్నించేవి,

ఆ రోజు చంద్రమతి ఒక నవల చదివాక మా యింటికొచ్చింది. నేను వీధి వసారాలో కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్నాను. దగ్గరలో వున్న కుర్చీ లాక్కుని కూర్చుంది.

ఇవాళేం నవల చదివావు. మంచి హుషారుగా వున్నావు, ఏమిటి సంగతి?'' అన్నాను.

"నేనొకటడుగుతాను చెప్పండి. ఎవరిలో నైనా ప్రతిభ వున్నదని గుర్తింప బడే మార్గమేమిటి?" అంటూ పరీక్షాధికారిలా ప్రశ్నించింది.

"ప్రతిభ రాణిస్తే ప్రతిభ వున్నట్టు లేకపోతే లేనట్టు" అంటూ ఏదో అస్పష్టమైన సమాధాన మిచ్చాను.

"అంటే మాట వరసకి నా గాత్రం బావుంటుందనీ, సినిమా పాటలు బాగా పాడతానని అంతా అంటారు. కాని నేనెద్దైనా సినిమాలో

పాడాలి. నాకు పేరూ ప్రఖ్యాతులు రావాలి, అప్పుడు నాకు ప్రతిభ వున్నట్టు గుర్తింప బడతానన్నమాట. అంతేనా!'' అంటూ ఏదో ఆలోచనలో పడింది.

చంద్రమతి ఏమిటాలోచిస్తోందో ఊహించాలని ప్రయత్నించాను. నాకర్థమయిందల్లా చంద్రమతికి తన గాత్రం మీద గొప్ప నమ్మకం ఏర్పడిందని. అదే ఆధారంగా పైకిఎక్కి పోవాలని ఆశపడుతూంది. కాని ఆమెకు లేని ప్రతిభను ఉన్నట్టుగా ఊహించు కుంటూందని నా అనుమానం.

చంద్రమతి తాను పైకెక్కి రావడానికి రెండునిచ్చెలు ఆధారంగా చేసుకుందని నాకర్థమయింది. ఒకటి తన గాత్రం, రెండోది తనఅందం. ఈరెండింటిమీద ఆశలు పెట్టుకుంది. ఎప్పుడైనా ఓ రంగుచీరో, పువ్వుల చీరో కట్టుకొని నా దగ్గరకొచ్చి నిలబడేది. ఆ చీరలో తన అందాన్ని గురించి నా రియాక్షన్ ఏమిటో తెలుసుకోవాలనే నా దగ్గర కొచ్చిందని నేను ఊహించేవాడిని. పాపం చంద్రమతికి ఆశాభంగం కలిగించడం నాకిష్టంలేదు. అలా అని ఆమె అందాన్ని పొగుడుతూ కూర్చునేంత రసికుడిని కాను. అయినా ఏదో ఒకటి మాట్లాడాలి కదా అని'' నీ చీర చాలా బావుంది, ఎంతక్కొన్నావు అన్నాను.

'' చీరకాదు ఈ చీరలో నేనెలా వున్నానో చెప్పండి '' అన్నది చంద్రమతి ఎంతో గర్వంగా.

" ఏచీర కట్టినా నువ్వొకలాగే వుంటావు. చీరవల్ల నీ అందం పెరిగిందంటే నీకన్యాయం చేసినట్టూ చీరకి క్రెడిట్ ఇచ్చినట్టు అవుతుంది.''

" చీర బావుందన్నారుగా అంటే నేను కట్టడంవల్ల చీరకందం వచ్చిందంటారా "

"అఁ అదే దీపం వల్ల గోడకందం వచ్చినట్టు" అన్నాను సంభాషణ చిక్కుల్లోకి దిగకుండా జాగ్రత్త పడుతూ,

"మీరు డొంకతిరుగుడుగా మాట్లాడుతారు. సూటిగా మీ దగ్గర నుంచి కామెంట్ రావడం చాలకష్టం, ఇంతకీ నేను అందంగా ఉన్నానని చెబితే మీ సొమ్మేం పోయింది నేనెంతో సంతోషించే దాన్నికదా" అంది చంద్రమతి.

నిజానికి చంద్రమతి నాజూగ్గా సంసారపక్షంగా వుంటుంది. మరీ అవ్సరసకాదు. ఐనా చంద్రమతి తానెంతో అందకత్తెననుకునేది. ఈ అందాన్ని ఒక పెట్టుబడిగా ఉపయోగించుకోవచ్చు ననుకునేది. దీనితో ఈ లోకాన్ని జయించవచ్చుననీ పైకెక్కి రావచ్చుననీ అనుకునేది. కాని ఆమె వేసుకునే అంచనాలన్నిటికి సరియైన అధారం లేదని చెప్పడం ఎలాగ? "నీ అందం లోకాన్ని జయించడానికి తగినంత బ్రహ్మాండమైనదేమీ కాదు. ఒక వేళ అయినప్పటికీ కేవలం అందంతో లోకాన్ని జయించడం అంత సులభం కాదు. ఎంతో మంచి అందగత్తెలు జీవితంలో ఓడిపోయి, తమ అందమే తమకు శతృవైందని విచారించే వాళ్ళున్నారు. అని చంద్రమతిని హెచ్చరించడమెలాగా ఈ సమాజంలో చాలవరకు ప్రతిదీ అదృష్టంమీద, చాన్సుమీద అధారపడింది. ఈ సమాజ జీవితం ఒక లాటరీ లాంటిది. ఈ లాటరీలో కొందరికి బహుమతులొస్తాయి. కాని అనేకమందికి రూపాయలు నష్టమౌతాయి.

చంద్రమతి మాత్రం అదృష్టవంతురాలు కావాలని కోరుకునే వాడిని.

మా ఇల్లాలికీ చంద్రమతికీ తీవ్రమైన అభిప్రాయ భేదాలుండేవి. మా అవిడ కేవలం ఇల్లాలనీ, ఇల్లాలు తప్ప మరేం కాదనీ చంద్రమతి అభిప్రాయం. చంద్రమతి గర్విష్టి అనీ, పెడిసరంగా మాట్లాడుతుందనీ

మా ఇల్లాలి అభిప్రాయం. చంద్రమతి ఒకరోజు మా ఆవిడతో "నేను కేవలం ఇల్లాలిగా బతకవలసివస్తే ఉరేసుకు చస్తాను" అందిట.

"కోరికలు ఆశలూ నెరవేరని వాళ్ళంతా ఉరేసుకు చస్తే యీ పాటికి సగం జనాభా తరిగిపోయేది" అందిట మా ఆవిడ.

ఈ అభిప్రాయ భేధాలను సర్దుబాటు చేయాలనే ప్రయత్నం నేనెప్పుడూ చెయ్యలేదు.

మరొక ఏడాది తరువాత చంద్రమతి తండ్రి అకస్మాత్తుగా గుండె జబ్బుతో చనిపోయాడు. వాళ్ళ సంసారం చాల యిబ్బందులలో పడింది. తరువాత చంద్రమతి మేనమామ యిద్దరాడపిల్లలకీ పెళ్ళిళ్ళు చేసి చంద్రమతి తల్లిని తన ఊరు తీసుకుపోయాడు.

నా చిన్ననాటి స్నేహితుడు విశ్వనాథం చంద్రమతిని పెళ్ళాడేడు. విశ్వనాథం వాళ్ళకి దూరపు బంధువట. విశ్వనాథం చాల విజ్ఞానతృష్ణ కలవాడు. మంచి మేధావి. చాల సహృదయుడు. నాకు మంచి స్నేహితుడు. కాని పైకి రాలేకపోయాడు. ఏదో ఒక చిన్న ఉద్యోగంలో కాలక్షేపం చేస్తున్నాడు.

"ఇంత చదువుకున్నావు, ఏదైనా మంచిఉద్యోగానికి ప్రయత్నించ కూడదా ?" అని నేనంటే విశ్వనాథం నవ్వేవాడు.

"నేను చదివిన చదువు ఎవడిక్కావాలయ్యా. నాచదువు ఒకరూపాయిని రెండు రూపాయలుగా మార్చడానికి పనికిరాదు" అనేవాడు.

ఇంత సంస్కారం సహృదయత వున్న నామిత్రుడ్ని పెళ్ళాడిన చంద్రమతి అదృష్టవంతురాలని నేననుకున్నాను.

ఆనాటి కీనాడు మళ్ళీ వాళ్ళింటికి వెళ్తున్నాను. నేను వాళ్ళింటికి వెళ్ళేసరికి విశ్వనాథం ఇంట్లో లేదు. ఇంకా ఆఫీసునుంచి రాలేదు.

చంద్రమతి నా రాకకెంతో సంతోషించింది.

చంద్రమతి యిల్లు ఇంట్లో సామానూ చూస్తే వీళ్లు అతి సామాన్యంగా బతుకుతున్నారని గ్రహించాను.

"అత్తయ్యగారూ పిల్లలూ బావున్నారా?" అంది చంద్రమతి గ్లాసుతో కాఫీ తెచ్చిపెడుతూ.

"ఆ బాగానే ఉన్నారమ్మా. నీకెంతమంది పిల్లలు?"

"ఇద్దరు, ఇదుగో వీళ్ళే."

"ఇద్దరూ ఆడపిల్లలేనన్నమాట" అన్నాను, చంద్రమతి జవాబివ్వలేదు. చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

చంద్రమతి ఇప్పుడు బాగా మారిపోయింది. ఈ పదేళ్ళ సంసార జీవితం చంద్రమతిని చాలా కృంగదీసింది. మొహం పాలిపోయి, తల వెంట్రుకలు సగం నెరసి, అకాల వార్ధక్యం అతి త్వరగా నెట్టుకొస్తున్నట్టుగా కనిపించింది. పాపం, పెళ్ళికాక ముందు ఎన్ని కలలు కంది, ఎన్ని ఆశలల్లుకుంది. ఎన్ని ఊహల గాలివటాలెగరేసింది. ఏది కాకూడదనుకుందో అదే అయింది. కేవలం ఇల్లాలుగా బతక్కూడదనుకుంది. చివరికా బతుకే గడుపుతూంది.

"వేడినీళ్ళున్నాయి స్నానం చెయ్యండి" అంది చంద్రమతి.

"వాడింకా రావటానికి ఆలస్యమవుతుందా?" అన్నాను.

"ఆయన సంగతి మరదక్కండి మామయ్యగారూ, ఆయన ఉద్యోగమేమిటో ఆయనేమిటో ఎవ్వరికీ అర్థంకాదు. ఆయనకెప్పుడూ ఆదేలోకం. వేలకొద్దీ సంపాదించే వాళ్ళయినా ఇంతగా ఉద్యోగాలకతుక్కుపోరు" అన్నది చంద్రమతి.

"పనెక్కువ గాబోలు."

"అదేం వనో ఏం లోకమో ఎంత చేసినా గొర్రె తోకలా ఆ ఉద్యోగానికి ఎదుగూ బొదుగూ లేదు."

"సరే మనమేం చెయ్యగలమమ్మా, ఎవరికెంత ప్రాప్తముంటే అంత వస్తుంది" అన్నాను నా వేదాంతంతో చంద్రమతిని ఊరడించాలనే ఉద్దేశంతో కాని చంద్రమతిలో గూడుకట్టుకున్న అసంతృప్తి అంత సులభంగా తొలగిపోయేది కాదని నాకు తెలుసు.

ఇంతలో విశ్వనాథం వచ్చాడు. నన్ను చూసి ఎంతో సంతోషించాడు. కుశల ప్రశ్నలు వేశాడు. ఈలోగా చంద్రమతి కాఫీ తెచ్చి యిచ్చింది. విశ్వనాథం కాఫీ తాగుతూ "మీ మావయ్య కిచ్చావా?" అన్నాడు.

"నువ్వు వచ్చేముందే తాగేనురా" అన్నాను.

"ఒరే భద్రం, నువ్వు మా ఇంట్లో వదిరోజులుండాలిరా. నీకు మీ మేనకోడలు మంచి మంచి పిండివంటలు చేసి పెడుతుంది. నీతో బాటు నేనూ తినొచ్చును," అన్నాడు నవ్వుతూ.

"అది సరేగాని మీరు బజారుకెళ్ళి ఏదైనా కూర తీసుకురండి. రాత్రికేం కూరలేదింట్లో" అంది చంద్రమతి.

"మేము సినిమాకెల్తాం. బజారుకెళ్ళడానికి టైం లేదు. అయినా ఒకపూట కూర లేకపోతేనేం. ఇంట్లో ఏదుంటే అదే తింటాడు" అన్నాడు విశ్వనాథం.

నువ్వు నా గురించి ప్రత్యేకమైన ప్రయత్నమేమీ చెయ్యకమ్మా, యివాళ శనివారం, నేను భోజనం చెయ్యను. రెండరటిపళ్ళు తిని మజ్జిగ తాగి పడుకుంటానంతే అన్నాను.

అలా అయితే ఫలహారం చేస్తాను అంది చంద్రమతి.

వద్దమ్మా, ఏమీ అక్కరలేదు. ఏమిరా విశ్వనాథం, నువ్వు ఫలహారం చేస్తావా, భోజనం చేస్తావా?

ఉంటే రెండూనూ అన్నాడు విశ్వనాథం అందరం నవ్వుకున్నాం.

రాత్రికి వంట ప్రయత్నం లేదు కాబట్టి చంద్రమతినీ పిల్లల్నీ కూడా తీసుకుని మేము సినిమాకెళ్ళేం

నేనక్కడున్న రెండు రోజులూ చాలా సరదాగా గడచిపోయాయి. ఒకరోజు చంద్రమతినీ పిల్లల్నీ బజారుకి తీసికెళ్ళి చంద్రమతికో చీర పిల్లలకి బట్టలూ కొన్నాను.

ఆనాటి రాత్రి నేకొన్న బట్టలు చూసి విశ్వనాథం చంద్రమతితో "మీ మామయ్య చేత బాగా డబ్బు ఖర్చు పెట్టిస్తున్నావే" అన్నాడు.

నే వద్దంటూ వుంటే బలవంతంగా కొన్నారు. రేపొద్దున్న బండికి వెళ్ళిపోతారట అంది చంద్రమతి

అంతలో నేనక్కడకి రావడం చూసి చంద్రమతి లేచి లోపలికి వెళ్ళబోయింది.

కూర్చోమ్మా. ఒరే విశ్వనాథం రేపొద్దున్న బండికి వెళ్తున్నానురా అన్నాను.

అదే చెప్తోంది చంద్రమతి. అయినా ఏమిటాతొందర అన్నాడు.

మరో రెండురోజు లుండరాదా మామయ్యగారు అంది చంద్రమతి

లేదమ్మా, నే వెళ్ళి తీరాల. ఈమారొచ్చినప్పుడుంటాను. పోనీ ఓ పదిరోజులు సెలవుపెట్టి మీరంతా మా వూరు రారాదూ కనీసం మార్పు కోసమైనా

"అది జరగనిమాట మామయ్యగారూ, ఇల్లు కదిలితే ఖర్చు. మీరే అత్తయ్యగార్ని పిల్లల్నీ తీసుకురండి" అంది చంద్రమతి.

నాకేం మాట్లాడాలో తోచలేదు.

"పోనీ యిప్పుడు నాతోరండి, తీసుకెళ్ళి మళ్ళీ దిగబెడతాను." విశ్వనాధం ఒక వారం పదిరోజులు సెలవుపెడతాడా'' అన్నాను నేను.

నువ్వు నీ మేనకోడల్ని పిల్లల్నీ తీసుకెళతానంటే నాకేం అభ్యంతరంలేదు కానీ నాకు మాత్రం యిప్పట్లో సెలవు దొరకదురా. నువ్వు వాళ్ళని తీసుకెళ్ళి మళ్ళీ దిగబెట్టు కావాలంటే అన్నాడు విశ్వనాధం.

నాకేం మాట్లాడాలో తోచలేదు. ఇంతకీ చంద్రమతి బయలుదేరుతుందా ?

"నాకు నిద్రొస్తోందిరా'' అని విశ్వనాథం ఈజిచైర్‌లోనే నిద్రపోయాడు.

"ఆయన్నిక్కడ వదిలి నేనెలావచ్చేది మామయ్యగారూ. ఆయనకి హోటలు భోజనం పడదు. ఇబ్బందిపడతారు. అదీకాక పిల్లల్ని వదిలుండడం ఆయనకలవాటులేదు. అయినా నామట్టుకు నాకు ఎక్కడికి వెళ్ళాలనే పెద్దకోరికేంలేదు. ఆ మాటకొస్తే నాలో యిప్పుడెలాంటి కోరికలూ ఆశయాలూలేవు మామయ్యగారూ నాకున్న కోరికల్లా ఒకటే నా పిల్లలిద్దరూ పైకిరావాలి. వాళ్లు నాలా వంటింట్లో నాలుగ్గోడల మధ్య మగ్గిపోకూడదు. వాళ్ళు పెద్దచదువులు చదవాలి. పేరు ప్రతిష్ఠలు సంపాదించాలి. పెద్దపిల్ల తెలివైంది. దాన్నెలాగైనా మెడిసన్ చదివించాలనీ, చిన్నపిల్లకి సంగీతం నృత్యం నేర్పించాలనీ అనుకుంటూ వుంటాను. ఇవేనా ఆశలు మామయ్యగారూ" అంది చంద్రమతి.

"సరేనమ్మా, నేను చేయగలిగిన సాయమేదైనా వుంటే చేస్తాను" అన్నాను.

ఇక్కడతో మా సంభాషణ ఆగిపోయింది. అంతాపోయి పడు

కున్నాము. నాకు చాలారాత్రివరకూ నిద్రపట్టలేదు. నేను చంద్రమతిని గురించే ఆలోచిస్తున్నాను.

చంద్రమతి తన జీవితంలో తీరని ఆశలు తనపిల్లలకి తీరాలనుకుంటూంది. పెళ్ళికాకముందు ఏన్నో ఆశలు పెట్టుకుంది. కేవలం ఇల్లాలిగా బతకవలసి వస్తే ఉరిపోసుకుంటానంది. కాని అలాగే బతకవలసి వచ్చింది. అయినా ఉరిపోసుకోలేదు. పరిస్థితులకి లొంగిపోయి జీవితంతో రాజీపడింది. తనపిల్లలమీద ఆశపెట్టుకుంది. మోడువారిన ఆమె మనసు యీ కొత్త చిగుళ్ళు వేయకపోతే నిజంగా ఉరిపోసుకునేదేమో.